తుందని ఆ పుల్లయ్య చెప్పాడు. నేను తపస్సుచేసి నీ చెవులో జుట్టుపెరిగేటట్లు వరం పొందాను. ఇక మన అదృష్టం చూచుకో'' అన్నాడు ఉత్సాహంతో.

''ఓరి నీ తాడుతెగా నీ అదృష్టం కోసం నన్ను ఇలా చంపకపోతే, అదృష్టమే కావాలని కోరుకోకపోయావురా పిచ్చివెధవా'' అన్నాడు.

''అదీ నిజమే. అలా చేయాల్సింది'' అనుకున్నాడు రంగయ్య.

రంగయ్య అప్పటినుంచి పిచ్చిరంగయ్య అయ్యాడు. అప్పటినుంచే ఎవరన్నా ''బాగులేదని'' అనుకొంటుంటే ''ని మేన మామ చెవులో జుట్టుందా'' అంటూంటాడు.

మీకు కథ బాగుందా. మీ మేన మామ చెవులో జుట్టుందా!!!

—:o:—

# కలిసివచ్చిన కాలం

శ్రీ కడియాల అమర్‌సుందర్

పూర్వం ఓ బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు ఆయవారాలు చేసుకుంటూ జీవిస్తుండేవాడు. రోజూ ఉదయమే లేచి కాలకృత్యాలు తీర్చుకొనేవాడు. భార్య పెట్టిన చద్దిని ఊళ్లోకి వెళ్లేవాడు. అందరికీ తిథివారనక్షత్ర ఫలితాలు చెప్పేవాడు. పొరుగు ఊళ్ళకుకూడా వెళ్ళి చెబుతుండేవాడు. రోజూ అలా ఉదయమే వెళ్ళి మధ్యాహ్నానికి ఇంటికి తిరిగివస్తుండేవాడు. ప్రజలు సమర్పించిన తృణమో ఫణమో స్వీకరించి భార్యకు తెచ్చి ఇచ్చేవాడు.

బ్రాహ్మణుడు మంచి మాటకారి. ఎవరితో ఎట్లా మాట్లాడాలో బాగా తెలుసు. అంతేకాదు. తెలివితేటల్లో అతన్ని మించినవాళ్ళులేరు ఆ ఊళ్లో. ఏ కాస్త రాతకోతల పని వచ్చినా ఊళ్లోవాళ్లంతా అతనిదగ్గరకే పరుగెత్తుకు వచ్చేవారు.

ఈ విధంగా అతడావూళ్ళో అందరికీ కావలసినవాడయ్యాడు. అతణ్ని గురించి అందరూ ''ఎంత మంచివాడు!'' అని చెప్పుకునేవారు.

బ్రాహ్మణుడు ఓ రోజున ఆలస్యంగా ఇంటికొచ్చాడు. వచ్చీరాగానే వంటింటిలోంచి గుప్పుమని పిండివంట వండుతున్న వాసనవచ్చింది. భార్య అప్పటికే పిండివంట పూర్తిచేసింది. భర్త వచ్చేసరికి పొయ్యిమీదనుంచి నూనె మూకుడుకూడా దించేసింది. చేసిన పిండివంటమీదకూడా మూత పెట్టింది.

భర్త గబగబా వంటింటిలోకి వచ్చాడు. కాసేపు వాసనచూశాడు. ''ఇవ్వాళ నువ్వేం వండిందీ చెప్పనా?'' అన్నాడు.

''ఆఁ చెప్పకోండి చూదాం!'' అంది భార్య.

''బూరెలు చేశావు కాదూ?'' అన్నాడు భర్త.

భార్య ఆశ్చర్యపోయింది. ''మీకెలా తెలిసిందండీ!'' అడిగింది ఆదుర్దాగా.

''నేను దివ్య దృష్టిలో చూశాను. అంచేత తెలిసింది.'' అన్నాడు భర్త గంభీరంగా ముఖం పెట్టి.

"ఏమిటీ నీదివ్యదృష్టితో చూశారా? నిజంగా!" అని రెట్టించింది భార్య.

"అవునని ఎన్నిసార్లు చెప్పాలే పిచ్చికొయ్యా!" అన్నాడు భర్త కొద్దిగా కోపం నటిస్తూ.

భార్య నిజమేనని నమ్మేసింది. తన భర్త దివ్యదృష్టిని గురించి అమ్మలక్కలందరికీ చెప్పింది. అసలే ఆవిడ ఉత్తివాగుడు కాయ. ఇటువంటి విషయాలలో అయితే మరింకా చెప్పవలసిందేమిటి? పనికట్టుకొని ఊరందరికీ చెప్పివొచ్చింది.

ఊళ్ళో జనమంతా బ్రాహ్మణుని అడగటం మొదలెట్టారు. "ఏమండీ! మీకు దివ్యదృష్టికూడా ఉందిటకదూ!"

బ్రాహ్మణుడు తెలివితక్కువవాడేం కాదు. "ఏదో ఆ పరమాత్ముని దయవల్ల, మీ చలవవల్ల ..." అనేసి ఊరుకునేవాడు.

"నిజమే కామోసు" అనుకున్నారు ప్రజలంతా. అప్పట్నించీ అతన్ని మరింత గౌరవంతో చూట్టం మొదలెట్టారు. బ్రాహ్మణుడు పొరుగూళ్ళు వెళ్ళవసరం లేకపోయింది. ఆ ఊళ్లోనే జరుగుబాటు చక్కగా సాగుతోంది.

ఓ రోజున ఆ వూళ్ళో షావుకారు ఇంట్లో దొంగతనం జరిగింది. డబ్బూ దస్కం, నగలు వగైరా పోయాయి. దొంగలు మాత్రం దొరకలేదు. మరి ఇకపోయిన సొమ్ము ఎట్లా దొరుకుతుంది? ఇంతలో బ్రాహ్మణుడి విషయం గుర్తుకొచ్చింది, షావుకారుకు. వెంటనే కబురు పంపించి పిలిపించారు.

"ఓ బ్రాహ్మణోత్తమా! మీ దివ్యజ్ఞాన సంపత్తిని గురించి మేమిదివరకే విన్నాం. దయచేసి మా ఇంట్లో జరిగిన దొంగతనంలో పాల్గొన్న దొంగలను గురించి ఆచూకీ ఇవ్వండి!" అని వేడుకున్నాడు షావుకారు.

ఈ మాటలు వినేసరికి బ్రాహ్మణుడికి ఏమనాలో కూడ తోచలేదు. కాసేపు అలాగే విభ్రాంతపడి కడకు తేరుకున్నాడు. కాస్త ధైర్యం పుంజుకున్నాడు. దేవుడుమీద భారంవేశాడు. ఎలుగెత్తి అరిచాడు. "ఓ రామా! నీ చేతిలో ఉన్నాయి..." అన్నాడు బిగ్గరగా.

అదే సమయంలో అక్కడ తరట్లాడుతున్న పాలేరు రాముడు ఈ మాటలు విన్నాడు. వాడికి ముచ్చెమటలుపోశాయి. కాళ్లు వొణికాయి. చేతులు గడగడలాడాయి. బ్రాహ్మణుడికి దివ్యదృష్టి ఉందనే విషయం వినిఉండటం మూలాన అతను చెప్పింది తనను గురించే అనుకున్నాడు.

"అయ్యా! క్షమించండి! నేనే చేశాను" అని బ్రాహ్మణుడి కాళ్ళమీదపడ్డాడు రాముడు.

"ఇంకెప్పుడూ అలా చెయ్యకు. మంచిగా మెలగడం నేర్చుకో. దేవుడు నీకు మేలుచేస్తాడు. లే!" అని లేవదీశాడు బ్రాహ్మణుడు.

బ్రాహ్మణుడి ముఖం ఒక్కసారి విప్పారింది. ఒక్కక్షణంక్రితం విచారసాగరంలో మునిగినవాడల్లా ఇప్పుడు సంతోషసాగరంలో ఓలలాడిపోతున్నాడు.

షావుకారు అతని దివ్యజ్ఞానాన్ని మెచ్చుకున్నాడు. అనేక కానుకలిచ్చి పంపించాడు.

బ్రాహ్మణుడి కీర్తి దవానలంలా ఆదేశం యావత్తూ పాకిపోయింది. ఏనోటవిన్నా, ఏయింట కన్నా అంతా అతని గురించిన మాటలే

బ్రాహ్మణుడు ఆయవారాలు చేసుకోవడం మానేశాడు. ఆ కానుకలతో హాయిగా కూచుని తింటున్నాడు.

ఇలా కొంతకాలం జరిగింది. ఒకనాడు రాజుగారి ప్రాసాదంలో పెద్ద దొంగతనం జరిగింది. అమూల్యమైన రత్నాలు, వజ్రాలు, వైఢూర్యాలు దొంగిలించబడ్డాయి. ఎంతగా ప్రయాసపడ్డా దొంగలు మాత్రం దొరకలేదు. రాజుగారికి కోపంవచ్చింది. మంత్రిని పిలిపించి అన్నాడు. "రేపీపాటికి దొంగల

ఆమాకీ తెలుసుకురాకపోతే నీ తలతీసి కోట గుమ్మానికి వేలాడకడతాను!"

"చిత్తం!" అని చేతులు నలుపుకుని బయటపడ్డాడు మంత్రి.

బ్రాహ్మణుడి విషయం మెరుపుగా తట్టి వెంటనే మనుష్యుల్ని పంపాడు మంత్రి.

బిక్కముఖం వేసుకుని రాజు ముందు నిలబడ్డాడు బ్రాహ్మణుడు. విషయమంతా వివరించి చెప్పాక బ్రాహ్మణుడి ముఖంమీద కత్తివేటుకుకూడా నెత్తురుచుక్కలేదు. "ఏదో ఒకసారి రక్షించబడ్డాను అనుకుంటే ఈ సారి అసలుకే ముప్పువచ్చేటట్లుందే" అనుకున్నాడు. ఏంచెయ్యడానికీ పాలుపోలేదు. ధైర్యం చిక్కబట్టుకున్నాడు కాసేపటికి.

ద్వారపాలకుల దగ్గరకు వెళ్ళాడు. "ఒకటి, రెండు, మూడు" అని లెక్కపెట్టాడు బిగ్గరగా. మళ్ళీ రాజుగారి దగ్గరకు వచ్చాడు. రాజుగారికి వినురుతున్న సేవకులనుచూచి "నాలుగు, అయిదు, ఆరు" అన్నాడు.

ద్వారపాలకులు, రాజుగారి సేవకులు కలిసి చేసిన దొంగతనం బయటపడిపోయింది. "ఆ సంఖ్యలు తమను ఉద్దేశించి చెబుతున్నవే" అనుకున్నారువాళ్లు. వెంటనే వాళ్ళు బ్రాహ్మణుడి కాళ్ళమీదపడ్డారు. క్షమించమని ప్రాథేయపడ్డారు. దొంగసొమ్ము తీసుకొచ్చి రాజుగారి ముందుంచారు.

రాజుగారికి చాలా ఆశ్చర్యంవేసింది. బ్రాహ్మణుడి దివ్యజ్ఞానానికి పట్టరాని సంతోషం పొందాడాయన. అమూల్యమైన అనేక రత్నాలు, హారాలు, వజ్రాలు, వైఢూర్యాలు, మాణిక్యాలు బ్రాహ్మణుడికి కానుకలుగా సమర్పించాడు రాజు. ఘనంగా సత్కరించి మరీ ఇంటికి పంపాడు.

ఆ కానుకలు స్వీకరించి ఇంటికొచ్చాడు బ్రాహ్మణుడు. ఇంకా ఆ దేశంలో ఉంటే ఎప్పటికైనా ముప్పు తప్పదని నిర్ణయించుకున్నాడు. మూటా ముల్లె సర్దుకొని ఆ రాత్రే మరో దేశానికి ప్రయాణమయ్యాడు బ్రాహ్మణుడు. రాజుగారిచ్చిన కానుకలతో అక్కడ హాయిగా జీవించారు భార్యాభర్తలు.

...—...

# యుక్తి

శ్రీ ఎ. ఎ. ఎన్. రాజు

అలమూరను గ్రామంలో
ఉండేవాడొక ధనవంతుడు
సోమన, రామన్న అను
పుత్రులుండే వారతనికి

కొంతకాలానికతనికి
సమీపించింది వృద్ధాప్యం
ధనమంతా ఒక్కనికే
ఇవ్వదలంచాడతడు

ఇల్లునిండే వస్తువు తెమ్మని
చెరొక రూపాయిచ్చాడు
పందెంలో నెగ్గినవానికే
చెందునన్నాడు ధనమంతా

సోమన్న బజారుపోయి
కొన్నాడొక బండెడుగడ్డి
తొందరగా యింటికి తెచ్చి
గృహమంతా నింపాడు